# ఓ ఉద్యోగం కోసం...

"సార్! మీకు కమిషనర్ గారి దగ్గర్నుంచి ఫోను" అంటూ పరిగెత్తుకొని వచ్చి చెప్పాడు మా ఆఫీసు సూపరింటెండెంట్ భాస్కరరావు.

నేను వెంటనే ఫోనెత్తి "నమస్కారం సార్" అన్నాను.

"మీ కాలేజిలో ఓ అటెండర్ పోస్టు చాలాకాలంగా ఖాళీగా ఉంటోందని, అది ఎస్టీలకు రిజర్వ్ చెయ్యబడిన పోస్టని, దాన్ని నింపడానికి పర్మిషన్ ఇవ్వండని మీరు చాలా లెటర్స్ రాశారు. నేను ప్రభుత్వం వారికీ విషయం తెలియజేసి చాలాకాలమైంది. ఎట్‌లాస్ట్, మొన్న వారు ఇలాంటి కొన్ని పోస్టుల్ని ఫిలప్ చెయ్యడానికి పర్మిషన్ ఇచ్చారు. అందులో మీ కాలేజి పోస్టు కూడా ఉంది. సో, మీరా పోస్టును ప్రాపర్ ప్రొసీజర్ ద్వారా ఫిలప్ చెయ్యొచ్చు. ఇది ఎస్టీకి రిజర్వ్ చెయ్యబడిన పోస్టు కాబట్టి మీరు నిరుద్యోగులుగా ఉన్న ఎస్టీల లిస్టును మీ జిల్లా ఐ.ఎ.డీ.ఎ. నుండి తెప్పించుకొని క్రాస్ చెక్ చేసుకొండి... ఈ విషయాలన్నీ చెబుతూ మీకో లెటర్ కూడా పంపిస్తున్నాము" అని చెప్పి మా కమిషనర్ ఆఫ్ హైయర్ ఎద్యుకేషన్ గారు ఫోన్ పెట్టేశాడు.

కమిషనర్ ఆఫ్ హైయర్ ఎద్యుకేషన్ గారంటే ప్రభుత్వ కాలేజిల్లో పనిచేసే ఉద్యోగస్తులందరికీ బాస్.

"మన కాలేజిలో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టును ఫిలప్ చెయ్యడానికి కమిషనర్ గారు పర్మిషన్ ఇచ్చారు" అన్నాను మా సూపర్నెంట్‌తో.

"ఇంతకాలానికి పర్మిషన్ ఇచ్చారా సార్! ఈ విషయాన్ని గూర్చి ఎన్ని లెటర్స్ రాశామో లెక్కలేదు" అన్నాడు సూపర్నెంట్ భాస్కర్‌రావు.

"థాంగ్గాడ్! ఇప్పటికైనా పర్మిషన్ ఇచ్చారు. ఇది ఎస్టీలకు రిజర్వ్ చెయ్యబడిన పోస్టు కాబట్టి మనం ఈ ఉద్యోగానికి అర్హుమైన ఎస్టీ క్యాండిడేట్స్ లిస్టును ఐటీడిఏ వాళ్ల దగ్గర్నుంచి తెప్పించుకోవాలి. మీరే స్వయంగా భద్రాచలంలోని ఐటీడిఏ ఆఫీసుకు వెళ్లి క్యాండిడేట్స్ లిస్టు పట్టుకురావాలి" అన్నాను.

"అలాగే సార్!" అన్నాడు సూపర్నెంట్.

ఆ మర్నాడే మా సూపర్నెంట్ భాస్కరరావు ఈ విషయానికి సంబంధించిన లెటర్స్ అన్నీ తీసుకొని భద్రాచలం వెళ్ళాడు.

అక్కడి ఐటీడీఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ–సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ) వారు 28 మంది అభ్యర్థుల పేర్లతో ఉన్న ఒక లిస్టును మా సూపర్నెంట్‌కిచ్చారు.

ఒక్క అటెండర్ పోస్టుకు – అదీ ఎస్టీలకు రిజర్వ్ చెయ్యబడిన పోస్టుకోసం 28 మంది ఎస్టీ క్యాండిడేట్స్ పోటీ పడ్తున్నారంటే ఆశ్చర్యం కల్గింది. నిరుద్యోగులుగా ఉన్న ఎస్టీ క్యాండిడేట్స్ తమ పేర్లను ఐ.టీ.డి.ఏ.లో రిజిష్టర్ చేసుకోవాలి. ఒక జిల్లాలోని ప్రభుత్వాఫీసులో ఎస్టీలకు రిజర్వ్ చెయ్యబడిన ఇలాంటి చిన్న పోస్టుల్ని నింపాల్సి వస్తే అర్హత కల్గిన అభ్యర్థుల లిస్టును ఐ.టీ.డి.ఏ. నుండే తెప్పించుకోవాలి.

అభ్యర్థుల లిస్టు తెప్పించుకున్నాక ఆ లిస్టు కరెక్టేనా అని మరోసారి మా కాలేజిలోని సీనియర్‌మోస్ట్ లెక్చరర్ మురళీధర్ రావును ఐ.టీ.డి.ఏ. ఆఫీసుకు పంపించి క్రాస్ చేయించాను.

తర్వాత చెయ్యాల్సింది ఈ 28 అభ్యర్థుల్ని ఇంటర్వ్యూకు పిలిచి ఎవర్ని సెలక్ట్ చెయ్యాలో నిర్ణయించటం. ఇలాంటి జిల్లా ఇంటర్వ్యూ కమిటీలో ముగ్గురు సభ్యులుండాలని ప్రభుత్వం వారు నిర్ణయించారు. ఈ జిల్లాలో ఉన్న ప్రభుత్వ కళాశాలల్లోని ఒక ప్రముఖ కాలేజిని నోడల్ కాలేజి అంటారు. ఈ నోడల్ కాలేజి ప్రిన్స్‌పాల్ ఈ ఇంటర్వ్యూ కమిటీకి మెంబర్ మరియు కన్వీనర్‌గా ఉంటాడు.

జిల్లాలోని మరో ప్రభుత్వ కాలేజిలో పనిచేసే మరో సీనియర్ ప్రిన్స్‌పాల్ కూడా ఇంటర్వ్యూ కమిటీలో రెండో సభ్యుడుగా ఉంటాడు.

ఇక ఆ ఉద్యోగానికి సంబంధించిన ఖాళీ యే కాలేజిలోనైతే యేర్పడిందో ఆ కాలేజీ ప్రిన్స్‌పాల్ తప్పనిసరిగా ఇంటర్వ్యూ కమిటీలో సభ్యుడుగా ఉంటాడు. ఈ ఖాళీ నేను పనిచేస్తున్న కాలేజిలో యేర్పడింది కాబట్టి నేను ఈ కమిటీలో సభ్యుడుగా ఉంటాను.

మా నోడల్ కాలేజి ప్రిన్స్‌పాల్ చంద్రశేఖర్‌రావు. ఆయనకు ఫోన్ చేశాను.

"హల్లో వేణుగోపాలరావు గారు... చాలాకాలానికి ఫోన్ చేశారు... యేమిటి విశేషం?" అన్నాడాయన.

"చాలాకాలానికేమిటి? మనం ఒకే ఊర్లో పనిచేస్తున్నాం కాబట్టి ఎప్పుడో ఎక్కడో అక్కడ కలుసుకుంటూనే ఉన్నాం కదా..." అన్నాను.

"అఫ్‌కోర్స్... అఫ్‌కోర్స్... కలుసుకుంటూనే ఉన్నా ఫోన్లు చేసుకోవటం లేదుకదండీ!" అంటూ అదో పెద్ద జోకైనట్టు గొల్లున నవ్వాడు. అలా కాస్సేపు నవ్వి "విశేషమేమిటో చెప్పండి?" అన్నాడు ఆయనే మళ్ళీ.

"మా కాలేజిలో చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఓ అటెండర్ పోస్టును నింపడానికి కమిషనర్ గారు పర్మిషన్ ఇచ్చారు" అన్నాను.

నేను చెప్పేదేమిటో పూర్తిగా వినకుండా ఆయన "కంగ్రాచ్యులేషన్స్ వేణుగోపాలరావు గారు... మీకో కొత్త అటెండర్ రాబోతున్నాడన్నమాట... వండర్‌ఫుల్... గ్రేట్..."

"థాంక్యూ... ఆ పోస్టును నింపడానికి ఐటీడిఏ నుండి ఎస్టీ క్యాండిడేట్స్ లిస్టు తెప్పించాం..."

"ఆ లిస్టు కరెక్టో కాదో క్రాస్‌చెక్ చేయించారా?"

"చేయించాను... 28 మంది అభ్యర్థుల లిస్టొచ్చింది. ఇప్పుడు వాళ్ళను ఇంటర్వ్యూకి పిలవాలి... ఇంటర్వ్యూ కమిటీకి కన్వీనర్ మీరే కదా... మీరే ఆ పని చెయ్యాలి..." అన్నాను.

"చేద్దాం... ఆ లిస్టును మాకు పంపించండి... ఓ రెండు వారాల టైమిచ్చి ఇంటర్వ్యూ కండక్ట్ చేద్దాం... మన ఇంటర్వ్యూ కమిటీలో మరో మెంబర్ రామ్‌సింగ్... ఆయనక్కూడా చెప్పాలి కదా!"

"మీరే చెప్పాలి సార్..."

"చెబుతాను... ఈరోజు ఐదో తేదీ కదా... 20వ తేదీనాడు ఉదయం పదిన్నరకు ఇంటర్వ్యూ మా కాలేజిలో ఉంటుందని క్యాండిడేట్స్ అందరికీ లెటర్స్ పంపిస్తాను... ఆరోజు ఇంటర్వ్యూ కండక్ట్ చేసి ఓ క్యాండిడేట్‌ను సెలక్ట్ చేద్దాం... ఎనీవే, మీకు మరోసారి కంగ్రాచ్యులేషన్" అంటూ ఆయనీసారి నర్మగర్భంగా నవ్వాడు.

"ఎందుకలా నవ్వారు" అన్నాను కొంచెం అసహనంగానే.

"ఊరికేనే... ఓ క్యాండిడేట్‌కు ఉద్యోగం... ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే అవకాశం లభించటమంటే మామూలు విషయమా? దీంట్లో ఎంతమంది చేతులు పెడ్తారో చూద్దురుగానీ... అఫ్‌కోర్సు... మీరు ఎవరికీ అవకాశం ఇవ్వరనుకొండి... కానీ కొన్నిసార్లు కొన్ని తప్పవనుకొండి"

"మీరేం మాట్లాడుతున్నారో నాకర్థం కావడం లేదు... కొన్నిసార్లు కొన్ని తప్పవంటే యేమిటి మీ ఉద్దేశ్యం" అన్నాను.

ఆయన మళ్ళీ నవ్వాడు.

"ఊరికేనే అన్నాన్లెండి... మీరు కొత్తగా ప్రిన్స్‌పాల్‌గా చేరారు కదా... కొద్దిరోజులు పోతే నేనన్న మాటకు అర్థమేమిటో మీకు అర్థమౌతుంది" అంటూ అతడు మళ్ళీ పెద్దగా నవ్వేసి ఫోన్ పెట్టేశాడు.

ఇతడిలా అనుక్షణం ఈ వెకిలి నవ్వులెందుకు నవ్వుతాడో నాకర్థం కాని విషయం.

చంద్రశేఖరరావుకు 57 యేళ్ళుంటాయి. ఎత్తుగా, లావుగా, ఎర్రగా ఉంటాడు. పదవీ విరమణకు దగ్గర్లో ఉన్నాడనీ, ఆలోగా సాధ్యమైనంత సంపాదించుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నాడని అతన్ని గురించి చెప్పుకోగా విన్నాను.

20వ తేది నాడు ఇంటర్వ్యూ ఉంటుందని క్యాండిడేట్స్ అందరకూ కాల్‌లెటర్స్ వెళ్ళిపోయాయి. 20వ తేది నాడు ఇంటర్వ్యూ కమిటీకి హాజరు కావాలని రామ్‌సింగ్‌కు కూడా లెటర్ ద్వారానూ, ఫోన్ ద్వారాను తెలియజేశాను. తప్పకుండా హాజరవుతానన్నాడు రామ్‌సింగ్.

కాల్ లెటర్స్ వెళ్ళిన ఐదారురోజుల తర్వాత నాకు ఫోన్లు రావడం ప్రారంభమయింది. నా ఫ్రెండ్స్ కొందరు ఫలానా క్యాండిడేట్ తమకు బాగా తెలుసునని, చాలా పేదవాడని, వీలైతే అతనికి ఉద్యోగం ఇవ్వండని స్నేహపూర్వకంగానే... చెప్పారు. ఎవరూ పెద్దగా వొత్తిడి చెయ్యలేదు. రాజకీయ నాయకులెవరూ ఈ విషయాన్ని గూర్చి నాకు ఫోన్లు చెయ్యనందుకు చాలా సంతోషించాను.

20వ తేది నాడు చంద్రశేఖరరావు ప్రిన్స్‌పాల్‌గా పనిచేస్తున్న నోడల్ కాలేజికి ఉదయం పదింటివరకు వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికే రామ్‌సింగ్ వచ్చేసి చంద్రశేఖరరావుతో మాట్లాడుతున్నాడు. రామ్‌సింగ్‌కు 55 యేళ్ళుంటాయి. ఈమధ్యనే ప్రిన్స్‌పాల్‌గా పదోన్నతి పొందాడు. అతన్ని గురించి ఎవరూ ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చెయ్యడం నేను గమనించలేదు.

"రండి... రండి... వేణుగోపాలరావు గారూ! రండి... యూ ఆర్ వెల్‌కమ్... హమారే గరీబ్‌ఖానామే తస్వీర్ రఖీయే..." అన్నాడు చంద్రశేఖరరావు తన సీట్లోంచి లేచి నిల్చొని.

"మీది గరీబ్‌ఖానా యేమిటి? ఇంత గ్రాండ్ అండ్ లావిష్ ప్రిన్స్‌పాల్ ఛేంబర్స్ మాకెవరికన్నా ఉన్నాయా?" అన్నాను రామ్‌సింగ్ పక్కనున్న గ్రాండ్ సోఫాలో కూర్చుంటూ...

"నిజం చెప్పారు సార్! ఇలాంటి సోఫాలు, ఇలాంటి ఏసీలు, ఇలాంటి ఫోన్లు, కంప్యూటర్లు మాకెవరికన్నా ఉన్నాయా? ఇలాంటివన్నీ మీరు సమకూర్చుకున్నారంటే మీరు నిజంగా గ్రేట్ సర్" అన్నాడు రామ్‌సింగ్.

"యేదోలెండి... జిల్లాలో ఇదే పెద్ద కాలేజి కాబట్టి ఇలాంటి వాటికి మన కమిషనర్ గారు దయతో పర్మిషన్ ఇచ్చారు... అదిసరె... మనం ఈ ఇంటర్వ్యూను ఎలా కండక్ట్ చేద్దామంటారు..." అన్నాడు చంద్రశేఖరరావు.

"మొదలు మీ అటెండర్‌ను పిలిచి ఎంతమంది క్యాండిడేట్స్ వచ్చారో తెలుసుకొండి" అన్నాను.

చంద్రశేఖరరావు బెల్ నొక్కి అటెండర్‌ను పిల్చాడు.

"ఎంత మందొచ్చారు?" అన్నాడు ప్రిన్స్‌పాల్.

"ఇప్పటి వరకు 18 మందొచ్చారు సార్..."

"మన సూపరెన్టెంట్‌ను పిలువు" అన్నాడు

కాస్సేపట్లోనే సూపరెన్టెంట్ వచ్చాడు.

"ఆ క్యాండిడేట్స్ అందరి ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫై చేసి ఓ లిస్టు తయారు చేసి మాకివ్వండి... త్వరగా" అన్నాడు చంద్రశేఖరరావు. సూపరెన్టెంట్ వెళ్లిపోయాడు.

ప్రిన్స్‌పాల్ ఛేంబర్స్ ముందు ఇంటర్వ్యూ అటెండ్ చెయ్యడానికొచ్చిన అభ్యర్థుల సందడి ప్రారంభమైంది. అందర్నీ క్యూలో నిల్చోబెట్టి ఆఫీసు స్టాఫ్ వారు వాళ్ళ సర్టిఫికెట్లను చెక్‌చెయ్యడం మొదలెట్టారు.

"ఇంటర్వ్యూ మొదలెట్టేముందు మీ ఇద్దరికీ ఓ విషయం చెప్పాలి" అన్నాడు చంద్రశేఖర్‌రావు నాకేసి, రాంసింగ్‌కేసి అదేపనిగా చూస్తూ.

"యేమిటా విషయం? చెప్పండి?" అన్నాను.

చంద్రశేఖర్‌రావు బెల్ నొక్కి అటెండర్‌ను పిలిచి "ఓ అరగంట వరకు నా ఛేంబర్స్‌లోకి ఎవర్నీ రానివ్వొద్దు" అన్నాడు.

"అలాగే సార్!" అని చెప్పి అటెండర్ వెళ్ళిపోయాడు.

"మీకీ విషయం ఎలా చెప్పాలో నాకర్థం కావడం లేదు..." అన్నాడు చంద్రశేఖర్‌రావు, కొంచెం తడబడ్తూ.

ఎప్పుడూ యేదేదో మాట్లాడి వెకిలినవ్వులు నవ్వే చంద్రశేఖరరావు అలా తడబడ్తూ గంభీరంగా మారిపోవడం ఆశ్చర్యాన్ని కల్గించింది.

"తెలుగులోనే చెప్పండిసార్... నాకు తెలుగు బాగావచ్చు" అన్నాడు రామ్‌సింగ్ నవ్వుతూ

"మీరిద్దరూ నేను చెప్పేది జాగ్రత్తగా వినాలి... వెరీ సీరియస్ మ్యాటర్" అన్నాడు ఇంటర్వ్యూ కన్వీనర్‌గారు.

అతడేం చెప్పబోతున్నాడో ఊహించడానికి ప్రయత్నించాను...

అతడు తన పక్కనే ఉన్న వాటర్‌బాటిల్‌లోని మంచినీళ్ళు తాగేసి మాకేసి మరోసారి చూశాడు.

"నిన్నరాత్రి మన జిల్లా మంత్రిగారు నాకు ఫోన్ చేశాడు. ఈ ఉద్యోగాన్ని ఫలానా క్యాండిడేట్‌కే ఇవ్వాలని చెప్పాడు. అంతకు ముందు మన నియోజకవర్గపు ఎం.ఎల్.ఏ. సిద్ధారెడ్డి గారు కూడా నాకు కలిసి తను, మంత్రిగారు ఇద్దరూ ఒకే క్యాండిడేట్‌కు ఉద్యోగం కోసం రికమెండ్ చేస్తున్నామని చెప్పాడు..." అన్నాడు చంద్రశేఖరరావు.

"మీరేమన్నారు?" అన్నాను.

"ఈ విషయం మీరు వేణుగోపాలరావు గారికి చెబితే బావుంటుంది... ఈ ఉద్యోగం ఆయన పనిచేస్తున్న కాలేజికి సంబంధించిందీ అని చెప్పాను... వాళ్ళేమో ఎవరి కాలేజికి సంబంధించిందయితే యేమిటి? ఇంటర్వ్యూ కమిటీకి మీరే కన్వీనర్ కదా... ఆ మిగతా ఇద్దర్ని కూడా మీరే మేనేజ్ చెయ్యండి అన్నారు" అన్నాడు చంద్రశేఖరరావు.

"మిగతా ఇద్దర్ని 'మేనేజ్' చెయ్యమన్నారా?" అంటూ నేను నవ్వాను. రామ్‌సింగ్ కూడా నవ్వాడు.

"నవ్వడం కాదు... ఇది సీరియస్ మ్యాటర్. మినిస్టర్ గారి మాట వినకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అన్నాడు కన్వీనర్ గారు.

"తీవ్రంగా ఉంటాయా? అంటే యేం చేస్తాడంటారు?" అన్నాను.

"మనల్ని ఉద్యోగాల్లోంచి తీసేస్తాడేమో?" అన్నాడు రామ్‌సింగ్, మళ్ళీ నవ్వుతూ.

"ఉద్యోగాల్లోంచి తీసెయ్యకపోవచ్చు. కానీ దూరంగా ట్రాన్స్‌ఫర్ చేసే అవకాశం ఉంది" అన్నాడు కన్వీనర్.

"చేయనీయండి... చూద్దాం" అన్నాను.

"నేను మినిస్టర్ గార్కి మాటిచ్చాను..." అన్నాడు కన్వీనర్ గారు.

"యేమని?" అన్నాను.

"అతడు చెప్పిన క్యాండిడేట్‌కే ఈ జాబిస్తామని"

"అలా ఎలా మాటిచ్చారు? ఈ జాబివ్వడం మొత్తం మీ చేతుల్లోనే ఉందనుకుంటున్నారా?" అన్నాను.

"లేదు. అలా అనుకోవడం లేదు. మీరిద్దరు కూడా మినిస్టర్ గారి మాటను గౌరవిస్తారనుకొని నేనాయనకు మాటిచ్చాను" అన్నాడు చంద్రశేఖరరావు.

"చాలా పొరపాటు చేశారు... మినిస్టర్ గారు చెప్పారనో, ఎం.ఎల్.ఏ గారు చెప్పారనో మనం ఆ క్యాండిడేట్‌కే ఈ ఉద్యోగం ఇవ్వదల్చుకుంటే ఈ ఇంటర్వ్యూ ఎందుకు? మినిస్టర్ గారినే తన కిష్టమొచ్చిన క్యాండిడేట్‌కు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వమనండి..." అన్నాను.

"మినిస్టర్ గారు డైరెక్టుగా మీతో చెప్పలేదని మీరిలా మాట్లాడుతున్నట్టుంది. ఆయనను ఇప్పుడే మీతో మాట్లాడిస్తాను" అంటూ చంద్రశేఖరరావు మినిస్టర్ గారికి ఫోన్ చెయ్యబోయాడు.

"వద్దు... మీరు మినిస్టర్ గారితో నాకు ఫోన్ చేయించాల్సిన అవసరం లేదు. ఇట్ డజంట్ మేక్ ఎనీ డిఫరెన్స్... అందువల్ల నాలో ఎలాంటి మార్పు ఉండదు" అన్నాను.

చంద్రశేఖరరావు ఫోన్ చెయ్యడం మానేసి కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు.

"అయితే ఇప్పుడేం చేద్దామంటారు?" అన్నాడు కాస్సేపాగి.

"వచ్చిన క్యాండిడేట్స్ అందరి బయోడేటాలు చూద్దాం... అందరికీ ఒక రాతపరీక్ష పెడదాం... క్వాలిఫికేషన్స్‌నుబట్టి, రాతపరీక్షలో వచ్చిన మార్కుల్ని బట్టి ఒక మెరిట్‌లిస్ట్ తయారుచేద్దాం. దాన్నిబట్టి క్యాండిడేట్‌ను సెలక్ట్ చేద్దాం" అన్నాను.

"అంతేనంటారా? రాంసింగ్ గారూ... మీరేమంటారు? మినిస్టర్‌గారి మాటను గౌరవించొద్దంటారా?"

"యేం మినిస్టర్‌గారండి... ఆయన కిష్టమొచ్చిన క్యాండిడేట్‌కు ఉద్యోగమిస్తే ఈ ఇంటర్వ్యూ ఎందుకండీ! వేణుగోపాలరావు గారు చెప్పిన ప్రకారమే ప్రొసీడవుదాం సార్... నో సెకండ్ థాట్ ఆన్‌దట్" అన్నాడు రాంసింగ్ చాలా దృఢంగా.

"సరే... మీ ఇష్టం" అన్నాడు చంద్రశేఖర్‌రావు.

కొంచెం ఆలస్యంగా వచ్చిన మరో ఇద్దరు అభ్యర్థులతో కలుపుకొని మొత్తం 20 మంది ఇంటర్వ్యూకొచ్చారు. అందరి క్వాలిఫికేషన్స్‌ని పరిశీలించాం. తర్వాత మీకిష్టమైన యే టాపిక్‌నైనా తీసుకొని ఒక పేజీ వ్యాసం రాయమన్నాం. అందరూ రాశారు. తర్వాత ఒక్కొక్కర్నే పిలిచి ఇంటర్వ్యూ చేశాం... చాలా సులభమైన ప్రశ్నలే అడిగాం. వాళ్ళిచ్చిన సమాధానాల్ని బట్టి మార్కులిచ్చాం.

క్వాలిఫికేషన్స్, రిటెన్‌టెస్ట్, మౌఖిక ఇంటర్వ్యూ – ఈ మూడింటిని బట్టి మెరిట్ లిస్టు తయారుచేశాం. ఆ లిస్టులో అందరికంటె పైన ఉన్న క్యాండిడేట్‌ను – విజయ్‌కుమార్ నాయక్ అనే అతన్ని సెలక్ట్ చేశాం. ఇదంతా జరిగేటప్పటికి సాయంత్రం నాల్గు గంటలయ్యింది.

విజయ్‌కుమార్ నాయక్ సెలక్టయినట్టు చెప్పగానే చంద్రశేఖరరావు మొఖం మారిపోయింది.

"మినిస్టర్ గారు రికమెండ్ చేసిన క్యాండిడేట్ ఇతడు కాడు" అన్నాడు చాలా బాధగా.

మినిస్టర్ గారి క్యాండిడేట్ అతని పేరు బలరామ్‌నాయక్ – మెరిట్‌లిస్టులో ఎక్కడున్నాడో చూస్తే 16వ స్థానంలో ఉన్నాడు.

"కాకపోతే చెయ్యగల్గిందేమీలేదు... విజయకుమార్ నాయక్‌ను ఈ ఉద్యోగానికి సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్టుగా రెజల్యూషన్ రాద్దాం... మినట్స్ బుక్ ఇవ్వండి" అన్నాను.

ఆయన డెస్కులోంచి సెలక్షన్ కమిటీ మినట్స్ బుక్ తీసి "మీరే రాయండి" అంటూ దాన్ని నాకిచ్చాడు.

"మీరే కన్వీనర్ కదా! మీరే రాయండి" అన్నాను.

"మీరే సెలక్ట్ చేశారు కదా! మీరే రాయండి" అన్నాడు.

"ఆల్‌రైట్. నేనే రాస్తాను" అంటూ మినట్స్ బుక్‌లో విజయకుమార్‌ను మా కాలేజీలో అటెండర్ ఉద్యోగానికి సెలక్ట్ చేసినట్టుగా, అతనికి వెంటనే కన్వీనర్ గారు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాల్సిందిగా పేర్కొంటూ రెజల్యూషన్ రాశాను. దానికింద నేను, రాంసింగ్ సంతకాలు చేసి చంద్రశేఖరరావుకిచ్చాం.

"మినిష్టర్ గార్కి నేనేం సమాధానం చెప్పుకోవాలో... ఆయన నన్నెక్కడికి ట్రాన్స్‌ఫర్ చేసి చంపుతాడో..." అన్నాడు చంద్రశేఖరరావు... మినట్స్ బుక్‌ను పక్కనపెడ్తూ.

"మొదలు మీరా రెజల్యూషన్ మీద సంతకం చెయ్యండి... తర్వాతే ఇంకేదన్న మాట్లాడండి" అన్నాను.

"నేను సంతకం చెయ్యక తప్పదా?" అన్నాడు యేడుపు మొఖం పెట్టి.

"తప్పదు" అన్నాను.

అతడు మినట్స్ బుక్ ఓపెన్ చేసి రెజల్యూషన్ మీద సంతకం చేశాడు.

"విజయకుమార్‌కు వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వండి. అతన్ని సెలక్ట్ చేసినట్టు మీ కాలేజి నోటీసుబోర్డు ద్వారా అందరికీ తెలియజేయండి" అన్నాను.

"అలాగే" అన్నాడు చంద్రశేఖరరావు.

"థాంక్యూ సర్..." అన్నాను.

"థాంక్యూ వేణుగోపాలరావు గారు... మనం చాలా న్యాయంగా, ఓ క్రమపద్ధతిలో కేవలం మెరిట్ ఆధారంగా క్యాండిడేట్‌ను సెలక్ట్ చేశాం... మీ కారణంగానే ఇలా జరిగింది" అన్నాడు రాంసింగ్, నాకు షేక్‌హాండిస్తూ.

నేనూ చాలా న్యాయంగా పనిచేశానన్న తృప్తితో ఇంటికొచ్చి భోజనం పెట్టమని మా ఆవిడను పురమాయించి వాష్ చేసుకోవడానికి బాత్‌రూంలోకెళ్ళాను.

"భోజనం చెయ్యకుండా ఇంతసేపున్నారా? యే హోటళ్ళోనైనా భోజనం చేశారేమో అనుకున్నాను" అంది మా ఆవిడ.

ఆమె అలా అంటుండగానే మా లివింగ్‌రూంలోని ల్యాండ్‌ఫోన్ అదేపనిగా మోగటం మొదలెట్టింది.

"ఎవరో చూడు?" అన్నాను మా ఆవిడతో.

మా ఆవిడ ఫోన్ లిఫ్ట్ చేసి "హలో" అంది. "ఉన్నారున్నారు. ఇప్పుడే వచ్చారు... ఇస్తాను. లైన్లో ఉండండి" అంటూనే

"త్వరగా రండి... ఎం.ఎల్.ఏ. గారట... మీతో అర్జెంట్‌గా మాట్లాడాలట" అంది మా ఆవిడ చాలా కంగారుగా.

నేను రిసీవర్‌ను చేతిలోకి తీసుకొని "హల్లో" అన్నాను.

"నేను... సిద్ధారెడ్డి... ఎం.ఎల్.ఏ.ను మాట్లాడుతున్నాను..."

"సిద్ధారెడ్డిగారు... చెప్పండి" అన్నాను.

"యేం చెప్పాలె... మా క్యాండిడేట్‌కు ఉద్యోగం రాకుండా మీరే అడ్డుపడ్డారట..."

"నేను అడ్డుపడటమేమిటి? అన్ని విధాలా అర్హతలున్న క్యాండిడేట్‌కే ఉద్యోగం వచ్చింది" అన్నాను.

"మా క్యాండిడేట్‌కు తప్ప వేరే యే క్యాండిడేట్‌కూ ఈ ఉద్యోగం రావడానికి వీల్లేదు... మీ నిర్ణయాన్ని మార్చాలి"

"అంటే... యేమిటి మీ ఉద్దేశ్యం?"

"మీరేదో రెజల్యూషన్ రాశారట... దాన్ని మార్చేయ్యాలి... మా క్యాండిడేట్‌ను సెలెక్ట్ చేసినట్టుగా మీరు కొత్తగా రెజిల్యూషన్ రాయాలి..."

"ఇదివరకు రాసిన రెజల్యూషన్ను యేం చెయ్యమంటారు?"

"చించేయండి... ఆ పేజీని చింపేసి వేరే పేజీలో ఈ రెజల్యూషన్ రాయండి. ఇలా చెయ్యడానికి మీ ఇంటర్వ్యూ కమిటీ కన్వీనర్ చంద్రశేఖరరావు అంగీకరించారు"

"అలాగా... అయితే ఆ పని ఆ కన్వీనర్ గారి చేతనే చేయించండి"

"చెయ్యడానికి ఆయన సిద్ధంగానే ఉన్నాడు... మీరిద్దరూ వెళ్ళి ఈ రెజల్యూషన్ మీద సంతకాలు చేస్తే సరిపోతుంది... మిమ్మల్ని చాలా మర్యాదగా అడుగుతున్నాను... మీరు పాత రెజల్యూషన్ను చించేసి కొత్త రెజల్యూషన్ రాయడానికి అంగీకరించండి"

"నేనూ చాలా మర్యాదగానే చెబుతున్నాను. అది సాధ్యమయ్యే పని కాదు..."

"మనం తల్చుకుంటే అన్నీ సాధ్యమవుతాయి... మేం ఇలాంటివి చాలా చేస్తుంటాం... మీకేం కావాలో చెప్పి తీసుకోండి... కానీ మేం చెప్పిన ఈ పని చేసిపెట్టండి... మీకు బావుంటుంది... మాకు బావుంటుంది..."

"మీకు బావుండొచ్చు... నాకు బావుండదు... మీరేమైనా చెయ్యగలరు... మేమలా చెయ్యలేం... నాకేమీ అక్కర్లేదు.... ఆల్‌రెడీ డిసైడ్ అయిన మ్యాటర్ను తిరగదోడే ప్రయత్నం చెయ్యకండి"

"యేదీ డిసైడ్ కాలేదు. ఫలానా క్యాండిడేట్ సెలక్టయ్యాడని చంద్రశేఖరరావు ఎనౌన్స్ చెయ్యలేదు.... ఆయన మేం చెప్పినట్టుగా చెయ్యడానికి రెడీగా ఉన్నాడు... మీరొక్కరు కోఆపరేట్ చేస్తే చాలు. రాంసింగ్‌ను మేం మేనేజ్ చేసుకుంటాం"

"మిస్టర్ సిద్ధారెడ్డి గారూ! ఆల్‌రెడీ నిర్ణయం జరిగిపోయింది... దాన్ని మార్చే ప్రసక్తేలేదు" అని నేను ఫోన్ పెట్టేశాను.

"చంద్రశేఖరరావు లాంటి ఒక సీనియర్ ప్రిన్స్‌పాల్ ఇంత ఘోరంగా పతనమైపోతాడని నేనూహించలేకపోయాను... అతనికి ఫోన్ చేసి విజయకుమార్ను సెలక్ట్ చేశామని ఎందుకు ఎనౌన్స్ చెయ్యలేదంటే

"మినిస్టర్ గారు వద్దన్నారు... మినిస్టర్ గారు మీతో కూడా మాట్లాడ్తాడట..." అన్నాడు.

"యేం మాట్లాడ్తాడు... సెలక్షన్ అయిపోయిందిగా... మంత్రిగారు స్వయంగా మాట్లాడకపోవచ్చు... నాకు ఎం.ఎల్.ఏ. సిద్ధారెడ్డితో ఫోన్ చేయించాడు... మనం రాసిన రెజల్యూషన్ను మార్చటానికి మీరంగీకరించారట కదా! మినట్స్ బుక్‌లోంచి ఆ పేజీని చించెయ్యటానిక్కూడా ఒప్పుకున్నారట... అలా చేస్తే యేమౌతుందో మీకు తెలీదా? మీరలా చేస్తే నేనేం చేస్తానో తెలుసా? జరిగిందంతా మన కమిషనర్ గార్కి తెలియజేస్తాను..."

"అబ్బే... మినట్స్ బుక్‌లో రాసిన రెజల్యూషన్‌ను మార్చటానికి నేనెప్పుడంగీకరించాను... ఆ ఎం.ఎల్.ఏ. అబద్ధం చెబుతున్నాడు... అతని మాటల్ని నమ్మకండి... దయచేసి ఈ విషయాన్ని కమిషనర్ దాకా తీసికెళ్ళకండి" అన్నాడు చంద్రశేఖరరావు.

"అయితే మీరు వెంటనే ఆ విజయకుమార్‌కు అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చెయ్యండి..." అన్నాను.

"రేపే ఇచ్చేస్తాను... తప్పకుండా ఇచ్చేస్తాను... ఈ మ్యాటర్‌ని ఇంతటితో వదిలెయ్యండి... ప్లీజ్" అన్నాడు.

నేను ఫోన్ పెట్టేశాను.

రాత్రి పదిగంటలకు భోజనం చేసి నిద్రపోవడానికి ఉపక్రమిస్తుండగా మా ల్యాండ్ ఫోన్ మోగింది.

"హలో... ఎవరు?" అన్నాను.

"మినిస్టర్ గారు మాట్లాడ్తాడు... లైన్‌లో ఉండండి" అన్నాడు మినిస్టర్ గారి పి.ఏ.

కాస్సేపట్లోనే మినిస్టర్ గారు "వేణుగోపాలరావు గారేనా?" అన్నాడు.

"అవును" అన్నాను.

"ఎం.ఎల్.ఏ. సిద్ధారెడ్డి చెప్పినట్టు చేస్తే మీకొచ్చే నష్టమేమిటి? మీకేం కావాలో చెప్పండి... అది తీసుకొని..."

అతడు పూర్తి చెయ్యకుండానే "నాకు న్యాయం కావాలి... నేను న్యాయం చేశాను... మీరు దాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు... నా కంఠంలో ప్రాణముండగా ఆ అన్యాయాన్ని జరగనివ్వను" అన్నాను. ఆవేశంతో నా కంఠం వణికింది.

"అంత పెద్ద మాటలెందుకులెండి ఈ రోజుల్లో కూడా మీలా ఇలా న్యాయం కోసం పోరాడేవాళ్ళుండటం గొప్ప విషయమే" అంటూనే మినిస్టర్ ఫోన్ పెట్టేశాడు.

"మినిస్టర్ గారు మనల్నేమన్నా చేస్తాడేమోనండి... ఆయన చెప్పినట్టు చేస్తే పోతుందిగా" అంది మా ఆవిడ.

"యేం చేస్తాడో చూద్దాం... అతడు చెప్పినట్టు చెయ్యండని నువ్వు మరోసారి చెప్పొద్దు..."అన్నాను దృఢంగా.

అలా ఆరోజు గడిచిపోయింది.

ఆ మర్నాడు నేను కాలేజికి వెళ్ళడానికి తయారవుతుండగా మళ్ళీ మా లివింగ్‌రూంలోని ఫోన్ మోగింది. అప్పుడు నేను బాత్‌రూంలో స్నానం చేస్తున్నాను.

మా ఆవిడ ఫోనెత్తి మాట్లాడింది. బహుశా మరో రాజకీయ నాయకుడో... లేక మళ్ళీ సిద్ధారెడ్డో అయ్యుంటాడనుకున్నాను.

స్నానం చేసి నేను బాత్‌రూంలోంచి బయటకు రాగానే మా ఆవిడ "మీ ఫ్రెండ్ కేశవరావు ఫోన్‌చేశాడండీ... బాత్‌రూంలో ఉన్నారు... పది నిమిషాల తర్వాత చెయ్యండ"ని చెప్పాను" అంది.

"కేశవరావు ఫోన్ చేశాడా?" అన్నాను ఆశ్చర్యంగా. నాకత్యంత ఆత్మీయుల్లో కేశవరావొకడు. హైస్కూల్ నుండి పీజీ వరకు మేం కలిసే చదువుకున్నాం... కేశవరావు గొప్ప సంపన్నుల కుటుంబానికి చెందినవాడు... నేనేమో కింది మధ్యతరగతి కుటుంబానికి చెందినవాణ్ణి... బి.ఏ.తోటే నా చదువు ఆగిపోయే పరిస్థితి యేర్పడినప్పుడు కేశవరావే నన్ను తనతోపాటు యూనివర్శిటీకి తీసికెళ్ళి ఎం.ఏలో జాయిన్ చేయించి నేను చదువుకోవడానికయ్యే ఖర్చంతా భరించాడు. నేనివ్వాళ్ళ ఓ డిగ్రీ కాలేజికి ప్రిన్స్‌పాల్‌ని అయ్యానంటే అది కేశవరావు చలవే. ఎం.ఏ. అయిపోయాక కేశవరావు ఉద్యోగం చెయ్యకుండా రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తూ హైదరాబాద్‌లో సెటిలయ్యాడు. హైదరాబాద్ వెళ్ళినప్పుడల్లా నేనతన్ని కలిసొస్తుంటాను. అయితే కేశవరావు ఈ మధ్యలో ఓ ప్రఖ్యాత సినీ నటుడు స్థాపించిన రాజకీయ పార్టీలో చేరాడని, ఎం.ఎల్.ఏ.గా పోటీ చెయ్యడానికి ఆ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్నాడని తెలిసింది.

"నీకెందుకీ దరిద్రపు పాలిటిక్స్?" అని నేను ఫోన్ చేస్తే "మనలాంటి మంచివాళ్ళమందరం మనకెందుకీ దరిద్రపు పాలిటిక్స్ అని తిట్టుకుంటూ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటే ఎలా? మనం చేరి భ్రష్టుపట్టిపోతున్న పాలిటిక్స్‌ని ప్రక్షాళం చెయ్యాలికదా..." అని కేశవరావు సమాధానం.

"ఈ పాలిటిక్స్‌నెవరూ ప్రక్షాళనం చెయ్యలేరు. గొంగట్లో కూర్చొని వెంట్రుకల్ని యేరివెయ్యడం సాధ్యమేనా?" అన్నాను.

"మనం తల్చుకుంటే అన్నీ సాధ్యమే" అని కేశవరావు సమాధానం.

అవును... ఇప్పుడీ కేశవరావెందుకు ఫోన్ చేసినట్టు అని నేను అనుకుంటుండగానే ఫోన్ మోగింది. ఫోన్ లిఫ్ట్ చేసి "హాయ్ కేశవ్? ఇట్స్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రైజ్... ఫోన్ చేశావట..." అన్నాను.

"హాయ్ వేణు... నీతో ఒక అవసరం పడిందోయ్..." అన్నాడు కేశవరావు.

"యేమిటో చెప్పు"

"నేను చెప్పింది నువ్వు తప్పకుండా చేస్తానంటే చెబుతాను..."

"నువ్వు చెప్పాక చెయ్యకపోవడమేమిటి? యేమిటో చెప్పు"

"తప్పకుండా చేస్తానని నువ్వు మాటిచ్చాక చెబుతాను... తీరా చెప్పాక నువ్వు నో అనకూడదు..."

"ఈ ప్రపంచంలో నీకంటే మించిన ఆప్తులు నాకెవ్వరూ లేరు. నువ్వు చెప్పాక చెయ్యకపోవటమంటూ... నేను చెయ్యగల్గిందయితే... ఉండదు"

"అలాకాదు... తప్పకుండా చేస్తానని మాటిచ్చాక చెబుతాను. తప్పకుండా చేస్తానని ఓ మాట చెప్పు"

కేశవరావు అలా పట్టుదలగా పదేపదే "తప్పకుండా చేస్తానని మాటివ్వు" అనడంతో నా మైండ్‌లో ఓ ఊహ మెరిసింది. ఎం.ఎల్.ఏ. సిద్ధారెడ్డి వెళ్ళి కేశవరావును కల్సి ఉంటాడు. కేశవరావు చెబితే నేను తప్పకుండా వింటానని సిద్ధారెడ్డికెవరో చెప్పి ఉంటారు... ఈ రాజకీయ నాయకులు సామాన్యులా?

ఈ ఆలోచన రాగానే "ఇదిగో కేశవరావు... యేమిటో త్వరగా చెప్పు... నేను చెయ్యగల్గిందయితే తప్పకుండా చేస్తాను... నీకోసం నా ప్రాణమైనా ఇస్తాను... త్వరగా చెప్పు..." అన్నాను.

"నీ ప్రాణమివ్వాల్సిన పనేం కాదు... చాలా చిన్నపనే..."

"యేమిటో చెప్పు కేశవ్! సస్పెన్స్‌తో చంపకు"

"యేం లేదు... నిన్న నీకు మా సిద్ధారెడ్డి ఫోన్ చేశాడటకదా..."

"మైగాడ్! ఈ విషయం నీదాకా వచ్చిందా?"

"అవును... నాదాకా వచ్చింది. నేను చెప్పిన మాటను నువ్వు కాదనవని సిద్ధారెడ్డికి మా కాలేజిలో పనిజేసే మీ మిత్రుడొకాయన చెప్పాట్ట... ఇప్పుడు సిద్ధారెడ్డి నా పక్కనే ఉన్నాడు... సిద్ధారెడ్డి చెప్పినట్టు నువ్వు చెయ్యాలి వేణు... నాకోసం... నా రాజకీయ భవిష్యత్తు కోసం నువ్వీ పని చెయ్యక తప్పదు..." అన్నాడు కేశవరావు చాలా పట్టుదలగా.

"సారీ కేశవ్... నా మిత్రుడిగా నాకు నువ్వీ పని చెయ్యమని చెప్పనేకూడదు. ఇలాంటి అవినీతికి ఒడిగట్టకూడదని నువ్వే నాకు చెప్పాలి. నీ దగ్గరకు ఆ సిద్ధారెడ్డి వచ్చినప్పుడు "మా వేణు ఇలాంటి పని చెయ్యడు... చెయ్యమని నేను కూడా చెప్పను అని నువ్వు చెప్పి నువ్వతని నోరుమూయించాలి... అలా చెయ్యకుండా నువ్వు నన్నీ పని చెయ్యమని చెప్పడం..."

"ఈ పని మీదే నా రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంది వేణూ!... రేపు సిటీలోని ఓ అసెంబ్లీకి బై ఎలక్షన్ జరగబోతున్నది... దాంట్లో పోటీ చెయ్యడానికి నాకీ పార్టీ టికెట్ కావాలి... నువ్వు నీ మిత్రుని ద్వారా మా క్యాండిడేట్‌కు ఉద్యోగం ఇప్పిస్తే నాకు మా పార్టీ టికెట్ ఇప్పిస్తానంటున్నాడు సిద్ధారెడ్డి... నీకు తెలుసుగా... నేనీమధ్యనే ఈ పార్టీలో చేరాను... నీ కోసం నేనేం చేశానో నీకు తెలుసు... నాకోసం ఈమాత్రం... నీ ప్రిన్స్‌పుల్స్‌ని కొంచెం సడలించి, సిద్ధారెడ్డి చెప్పినట్టుగా ఆ రెజల్యూషన్‌ను మార్చేసి వాళ్ళ క్యాండిడేట్‌కు ఆ ఉద్యోగం ఇప్పిస్తే నాకు నువ్వు గొప్ప మేలు చేసినవాడవవుతావు... ఆ క్యాండిడేట్ వెనక మీ జిల్లా మినిస్టర్ కూడా ఉన్నాడు. మినిస్టర్ గార్కి చెప్పి నాకు ఎం.ఎల్.ఏ.గా పోటీ చెయ్యడానికి టికెట్ ఇప్పిస్తానని సిద్ధారెడ్డి నా చేతిలో చెయ్యేసి చెప్పాడు. నాకోసం నువ్వీ చిన్న త్యాగం చేస్తే నాకు ఎం.ఎల్.ఏ. టికెట్ ఇప్పించిన వాడవుతావు. మేం ప్రామిస్ చేసిన క్యాండిడేట్‌కు ఈ ఉద్యోగం ఇప్పించుకోలేకపోతే మేమా నియోజకవర్గంలో తలెత్తుకొని తిరగలేమంటున్నాడు సిద్ధారెడ్డి... ప్లీజ్ కేశవ్... నువ్వు నాకోసం ఈ పనిచేసి తీరాలి... అవినీతికి పాల్పడుతున్నానని బాధపడకు. ఓ ప్రాణమిత్రుని కోసం ఈ సహాయం చేసి రుణం తీర్చుకున్నాననుకో..."

"నీకోసం ఇంకేం చెయ్యమన్నా చేస్తాను... ఇది మాత్రం సాధ్యంకాదు... పాలిటిక్స్‌ని ప్రక్షాళనం చేస్తానని పాలిటిక్స్‌లోకెళ్ళిన వాడివి నన్నీ నీచమైన పని చెయ్యమని నువ్వు చెప్పడం ఘోరం కేశవ్... ప్లీజ్... ఈ విషయాన్నింతటితో వదిలెయ్యి" అని బాధతో వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని ఓ చేత్తో అదుముకుంటూ మరోచేత్తో రిసీవర్‌ని క్రాడిల్ మీద పెట్టి దీర్ఘంగా నిట్టూర్చాను. కేశవరావు నాకు నిజంగా జన్మలో మరచిపోలేనంత గొప్ప సహాయం చేశాడు. అతడింతగా ప్రాధేయపడ్తున్నా, అతడు చెప్పినట్టుగా చెయ్యలేకపోతున్నందుకు నా గుండెలు ఘూర్ణిణ్ణాయి.

* * * *

ఆరోజే చంద్రశేఖర్‌రావు దగ్గరకు వెళ్ళి విజయ్‌కుమార్‌కు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను తయారు చేయించి రిజిష్టర్డ్ పోస్టులో అతని అడ్రసుకు పంపించేలా చేశాను. ఇదారు రోజుల తర్వాత నేను కాలేజి నుండి ఇంటికి రాగానే మా ఇంటిముందు నాకోసం ఓ మధ్యవయస్కుడైన వ్యక్తి ఎదురుచూస్తున్నాడని గమనించాను. స్కూటర్ దిగి నేనతనికేసి చూశాను. అతడు చదువుకున్న వాడిలాగే కనిపించాడు. అతన్ని ఇంట్లోకి రమ్మన్నాను.

"నమస్కారం సార్!" అన్నాడతడు. నేను ప్రతినమస్కారం చేసి అతన్ని కూర్చోమన్నాను.

"నాపేరు భూక్యా నాయక్ సార్... నేను ఫైర్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాను. మొన్న మీ కాలేజిలో అటెండర్ ఉద్యోగం కోసం జరిగిన ఇంటర్వ్యూకొచ్చిన వాళ్ళల్లో నా కొడుకు కూడా ఉన్నాడు సార్! నా కొడుక్కు ఈ ఉద్యోగం ఇప్పిస్తానంటే ఎం.ఎల్.ఏ. సిద్ధారెడ్డికి నేను అప్పుచేసి 25 వేలిచ్చిన సారూ! నీ కొడుక్కు ఉద్యోగం వచ్చినట్టే అనుకో అన్నాడు సారూ! కానీ నా కొడుక్కు ఉద్యోగం రాలేదు సారూ! ఆ కాలేజి ప్రిన్సిపాల్ - అంటే మీరు, పెద్దమొత్తంలో డబ్బులు తీసుకొని విజయకుమార్ నాయక్ అనే క్యాండిడేట్‌కు ఉద్యోగం ఇచ్చిండని సిద్ధారెడ్డి చెప్పిండు సారూ! కని సిద్ధారెడ్డి చెప్పింది నిజం కాదు సారూ... నేను మీరు పనిచేస్తున్న కాలేజికెళ్ళి చాలామందిని అడిగిన సారూ... మీరు నిప్పులాంటి మనుషులని చెప్పింద్రుసార్... నాకా విజయకుమార్ కూడా తెలుసు సారూ! వాడూ మావోడే... నువ్వు వేణుగోపాలరావుకు డబ్బులిచ్చినవా అని అడిగిన సారూ! ఒక్కపైసా కూడా ఇయ్యలేదని వాడు ప్రమాణం చేసిండు సారూ! మీరు చాలా న్యాయంగా పనిచేసి మావోని కంటె అన్నివిధాలా అర్హుడైన విజయకుమార్‌ను సెలెక్ట్ చేసింద్రు సార్... మీ అసుంటోళ్ళుండబట్టే ఈ ప్రపంచంల ఈ మాత్రం న్యాయమైనా ఉంది సారూ... మీ కాళ్ళకు మొక్కాలే సారూ!" అంటూనే ఆ వ్యక్తొచ్చి నా కాళ్ళకు దండం పెట్టాడు. "ఇదేంపని" అంటూ అతన్ని ఆపబోతున్నా అతడు ఆగలేదు.

"నిజం సార్! మీ అసుంటోళ్ళుండబట్టే ఈ లోకంల న్యాయమనేది ఈ కొంచెమైనా ఉంటున్నది సారూ!" అని అతడు మరోసారి చేతులు జోడించి దండంపెట్టి వెళ్ళిపోయాడు.

నా కన్నుల్లోకి ఉబికివస్తున్న కన్నీళ్ళను ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ "ఈ జన్మకీ తృప్తిచాలు" అనుకున్నాను.

✧✧✧✧✧

– సి.పీ. బ్రౌన్ అకాడమి వారి ద్వైమాసిక 'సాహిత్య ప్రవంతి'